కోడెలను దైవ రూపకంగా భావించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రైతులకు ఉచితంగా కోడెలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 30 : కోడెలను పొందిన రైతులు వీటిని జాగ్రత్తగా దైవ రూపంగా భావించి చూసుకోవాలని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అర్హులైన పేద రైతులకు కోడెలను అందిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గోశాలలో ఆలయ అర్చకుల వేదమంత్రాల మధ్య గోపూజ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో నేను దేవస్థానం చైర్మన్‌గా ఉన్న సమయంలో కోడెలను పంపిణీ చేశాం. మూడు నెలల క్రితం సుమారు 1600 కోడెలను పంపిణీ చేశామని, వీటిని ఇతరులకు విక్రయించడానికి వీలు లేదని, సొంత వ్యవసాయానికి మాత్ర మే వినియోగించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయానికి గత బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, గోశాల ఇన్‌చార్జి ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేశ్ కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్
- కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు ఇండ్లు రాని లబ్ధిదారులు

కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : సిరిసిల్లలో నిర్మాణం పూర్తయి ఇప్పటికీ పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట డబుల్ బెడ్ రూంలు రాని లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ, కలెక్టర్ వెంటనే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, సాపనపెల్లి రాములు, బెజిగం సురేశ్, ఒడ్నాల వీరేశం, సందుపట్ల పోచమల్లు, గాజుల రూప, నల్ల లావణ్య, స్వప్న, తిరుపతి, బాబు, శ్రీనివాస్, తదితరులున్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 30: సిరిసిల్ల పట్టణాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిల్ ఆమోదం తెలిపిన అజెండా అంశాలను చైర్‌పర్సన్ జిందం కళ వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన చీరెలు, దుస్తులు, తదితర సామాగ్రికి అవసరమైన రూ.19లక్షలు, పబ్లిక్ టాయిలెట్ల మరమ్మతు, నూతన టాయిలెట్ల నిర్మాణం, తదితర పనుల రూ.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వివిధ వార్డులలో మురికి కాలువల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, తదితర పనులకు రూ.8లక్షలు, సిరిసిల్ల పట్టణంలోని దామోదర సంజీవయ్య విగ్రహం ఆర్‌అండ్‌బీ రోడ్డు డివైడర్ మధ్యలోకి మార్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 12అజెండా అంశాలకు పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తదితరులున్నారు.

కేటీఆర్‌ను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు

- బీఆర్ఎస్ నేతలు మ్యాన రవి, శ్రీనివాస్, హరీశ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 30: కేకే మహేందర్‌రెడ్డి మెప్పు పొందేందుకు కేటీఆర్‌పై విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ చేసిన అభివృద్ధిపై విమర్శలు చేయడం వారి అవగాహనా లోపానికి నిదర్శనంగా భావిస్తున్నామన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కాంగ్రెస్ వచ్చిన పది నెలల కాలంలోనే నేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలవడం బాధాకరమన్నారు. బతుకమ్మ చీరెలకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించిందని, దమ్ముంటే కాంగ్రెస్ అంతకుమించి కేటాయించి మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఎనిమిదేండ్ల కాలంలో వస్త్రపరిశ్రమలో ఎటువంటి సమ్మెలు, ధర్నాలు చూడలేదన్నారు. బతుకమ్మ పండుగకు చీరఇస్తారని మహిళలు ఆశతో చూస్తున్నారని, ప్రభుత్వం ఆ దిశగా కనీసం స్పందించడం లేదన్నారు. సిరిసిల్ల అభివృద్ధికి గత ప్రభుత్వం ఇచ్చిన రూ.40కోట్ల పనులను అడ్డుకుంటుంది మీరు కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బాని హరీశ్ మాట్లాడుతూ, కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల వాళ్లను తిడుతున్నా వారికి కనీసం సిగ్గులేదని విమర్శించారు. ప్రతి ఒక్కరూ కేటీఆర్ గురించి విమర్శించడం అలవాటుగా మారిపోయిందన్నారు. కేటీఆర్ గురించి మాట్లాడుతున్న మీ బతుకులేందో సిరిసిల్ల ప్రజలందరికీ తెలుసునిగుర్తుంచుకోవాలన్నారు. మహేందర్‌రెడ్డికే కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. కేటీఆర్ చేసిన అభివృద్ధి గురించి నేతన్న చౌక్ వద్ద చర్చకు తామెప్పుడూ సిద్ధమేనని, దమ్ముంటే నేడు చర్చకు రావాలని సవాల్ విసిరారు. మరోసారి కేకే మహేందర్‌రెడ్డి మెప్పుకోసం కేటీఆర్ గురించి మాట్లాడితే చెప్పులు, చీపుర్లతో కొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేటీఆర్‌పై విమర్శలు చేస్తే నియోజకవర్గ పొలిమేర వరకు తరిమికొడతామన్నారు. మరోసారి బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దార్ల సందీప్, బత్తుల రమేశ్, గడ్డం బాస్కర్, మునీర్, తదితరులున్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలి

- బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మధు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు,నేతలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 30: కాంగ్రెస్ నేతలు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం తంగళ్లపల్లిలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నేతలు కేటీఆర్,బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లిరామ్మోహన్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి ఉద్యమకారుడు కాదని, కక్ష్య సాధింపుదారుడని, ఆంధ్ర నాయకుల అడుగులకు మడుగులు ఒత్తి అనేక పార్టీలు మారిన వ్యక్తి అన్నారు. కేటీఆర్‌పై ఐదుసార్లు ఓడిపోయినా ఇజ్జత్ లేకుండా కేటీఆర్‌పై మాట్లాడుతున్నాడని భగ్గుమన్నారు. దమ్ముంటే కేటీఆర్ చేసిన అభివృద్ధి కంటే రెట్టింపు అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసేది మీరైతే.. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ట్రాక్టర్ల దగ్గర మామూళ్లు వసూలు చేసింది మీరేనని, ఆధారాలతో బయటపెడుతామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు చేస్తే ఊరుకోబోమన్నారు. రేషన్ డీలర్ల నియామకాల్లో అవకతవకలు చేసింది నిజం కాదా..? రాత్రిపూట ప్రొసీడింగ్స్ పంచాల్సిన అవసరం ఏముందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారిన వాళ్లు, కేటీఆర్ గురించి మాట్లాడి సహించేది లేదన్నారు. హైడ్రాతో పేద ప్రజలు ఇబ్బంది పెడుతున్నారని మీ నాయకుడు సీఎం, ఇక్కడి నేత కేకే మహేందర్‌రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్ అని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆఫీసు దగ్గర గుమిగూడి ఎవ్వరిని, ఎప్పుడు బ్లాక్ మెయిల్ చేయాలి చూస్తున్నది మీరే నన్నారు. వ్యక్తిగత దూషణలు మానుకోవాలని, మరోసారి చేస్తే ఊరుకోబోమన్నారు. కేటీఆర్‌ను ఒక్క మాట అంటే, పది మాటలు అంటామని హెచ్చరించారు. కేటీఆర్‌కు కేకేకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. దొంగ హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, గడిచిన పది నెలల్లో ఏ పార్టీకిలేని వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనియెడల ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెడుతామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత రామ్మోహన్‌పై ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్, రామ్మోహన్ వెంట రామదండులా మేమున్నామన్నామని హెచ్చరించారు. సమావేశంలో కొయ్యడ రమేశ్, జంగంపల్లి శేఖర్, సిలువేరి చిరంజీవి, నీరటి బాబు, బొడ్డు శ్రీధర్, మీసాల కృష్ణ, బండిజగన్, గుండు ప్రేమ్‌కుమార్, ఆసాని శ్రీకాంత్ రెడ్డి, అమర్ రావు, కృష్ణ, అనిల్, శ్రీకాంత్‌రావు, కరుణాకర్, నక్క కొమురయ్య, వెంగల రమేశ్, రాజు, నవీన్‌రెడ్డి, తదితరులున్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఇక్కడ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు సావనపెల్లి రాములు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, హమాలీ కార్మికులున్నారు.

సంఘ అభివృద్ధిలో పాలకవర్గం కృషి అభినందనీయం

- కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : సంఘం అభివృద్ధికి పాలకవర్గం కృషి అభినందనీయని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొండూరి మాట్లాడుతూ, గతంలో రూ.2 వేలు, రూ.3 వేలు ఇచ్చిన కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకులు ఇప్పుడు ఒక వ్యక్తికి రూ.50 లక్షల వరకు లోన్లు ఇస్తున్నాయన్నారు. సభ్యుల సహాయ సహకారాలతో బ్యాంకులు ముందుకు పోతున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధిని చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చూసి వెళుతున్నారన్నారు. నూతనంగా ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలును పాలకవర్గ సభ్యులు శాలువాతో సన్మానించారు. అంతకుముందు చైర్మన్ తన్నీరు బాపురావు పోతుగల్ సహకార సంఘం వరుసగా ఏ గ్రేడ్ సాధించి 2013లో రెండు కోట్ల టర్నోవర్ నుంచి 30 కోట్లతో సంఘం అభివృద్ధిలో ముందుకు పోతున్నదని తెలిపారు. సహకార సంఘం వ్యయాలు , ఖర్చులు, సంఘం సాధించిన ప్రగతిని సభలో ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తన్నీరు బాపూరావు, వైస్‌చైర్మన్ మెరుగు రాజేశంగౌడ్, డైరెక్టర్లు సతీశ్ చందర్, కట్ట బాపురావు, వెంకట్ రెడ్డి గన్నె నర్సింలు, మాధవరావు, లక్ష్మణరావు, కుర్ర కీర్తన్, ఆనంద్, సీఈవో కృష్ణ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘ సభ్యులు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల కోసం ప్రదక్షిణలు

- వేములవాడ ఆలయానికి పలువురు ఉద్యోగుల దరఖాస్తులు
- యాదగిరిగుట్టకు సూపరింటెండెంట్ శ్రీలత రిలీవ్

వేములవాడ, సెప్టెంబర్ 30: దేవాదాయ శాఖలోబదిలీ అయిన ఉద్యోగుల్లో కొందరు ఆశావాదులు బదిలీల కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి బదిలీ అయిన యాదగిరిగుట్టకు చెందిన పర్యవేక్షకులు రాజన్‌బాబును ఆగస్టులోనే తిరిగి యాదగిరిగుట్టకు కేటాయించారు. తాజాగా, గత నెల 23న పర్యవేక్షకురాలు శ్రీలతను యాదగిరిగుట్టకు డిప్యూటేషన్ కేటాయిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేయగా, సోమవారం ఆమెను రాజన్న ఆలయ అధికారులు రిలీవ్ చేశారు. అయితే, రాజన్న ఆలయానికి బదిలీపై వచ్చిన పర్యవేక్షకులకు వర్క్ ఆర్డర్, డిప్యూటేషన్ విధులను కేటాయిస్తూ తిరిగి యాదగిరిగుట్టకు కేటాయించడం బదిలీపై వెళ్లిన ఆలయ ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. దీంతో వేములవాడ రాజన్న ఆలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులు అక్కడి ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకువస్తూ మాతృ సంస్థకు చేరుకునేందుకు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు ఉద్యోగులు వేములవాడకు వచ్చేందుకు దరఖాస్తులు చేసుకున్నారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. అయితే, రాజన్న ఆలయంలో పర్యవేక్షకులు 14 మంది ఉండగా ఇద్దరు ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు యాదగిరిగుట్టకు తిరిగి వెళ్లారు. పరిపాలనాపరమైన బాధ్యతలు చూసే పర్యవేక్షకుల సంఖ్య పదిమందికి చేరుకోవడంతో రాజన్న ఆలయంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే విజిలెన్స్, ఏసీబీ తనిఖీల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తుండగా పరిపాలనా పరమైన లోపాలు కూడా ఉన్నాయని ఎత్తి చూపిన విషయం తెలిసిందే. మొత్తానికి పరిపాలనాపరమైన లోపాలు ఈవో స్థాయి అధికారికి మచ్చ తెచ్చే విధంగా ఉండడంతో ఏ మేరకు రాజన్న ఆలయానికి తిరిగి ఉద్యోగులను కేటాయిస్తారు అనేది అందరికీ ప్రశ్నార్థకంగా మారింది. డిప్యూటేషన్ విధానం మొదలు కావడంతో తిరిగి మాతృ సంస్థకు చేరేందుకు కూడా ఉద్యోగులు ఆసక్తి చూపుతుండగా నాయకుల ఆశీర్వాదాలు ఎవరికి దక్కనున్నాయో అనేది కూడా ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పర్యవేక్షకురాలు శ్రీలత రిలీవ్‌పై ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారి నుంచి ఆదేశాలు అందిన మేరకు రిలీవ్ చేశామని తెలిపారు.